సాక్షి శ్రీకాకుళం

మంగళవారం ၊ 14 ၊ నవంబర్ ၊ 2023



ఆఫ్‌షోర్ పనులు షురూ

ఆఫ్‌షోర్ పనులు మొదలయ్యాయి. కుడి కాలువ పనులు చేస్తున్నారు.

- 8లో



బాబోయ్ ఎలుగు..

కాశీబుగ్గ: పలాస మండలం మాకనపల్లి, బొడ్డపాడు పంచాయతీల మధ్య సోమవారం మూడు ఎలుగుబంట్లు హల్‌చల్ చేశాయి. ప్రజలు భయాందోళనకు గురయ్యారు. అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు.

శ్రీముఖలింగంలో బారికేడ్ల ఏర్పాటు

జలుమూరు: ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీముఖలింగం కార్తీక మాసం ఉత్సవాల్లో భాగంగా సోమవారం బారికేడ్లు, ఆలయ ఆవరణలో భక్తులకు ఎండ తగలకుండా షామియానాలు ఏర్పాటు చేసినట్లు ఆలయ ఈఓ పి.ప్రభాకరరావు తెలిపారు. మంగళవారం నుంచి కార్తికమాసం ప్రారంభం కానున్న నేపథ్యంలో ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. భక్తులకు ఉచిత ప్రసాదాలు, అన్నదానం వంటివి అందించేందుకు దేవదాయ శాఖ అధికారులను సంప్రదించాలని ఆయన కోరారు.

న్యూస్‌రీల్

దరఖాస్తుల స్వీకరణకు మరో రెండు రోజులు గడువు పెంపు

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో ఈ ఏడాది నుంచి ప్రారంభిస్తున్న నూతన డిగ్రీ+బీఎడ్ కోర్సుల దరఖాస్తుల స్వీకరణకు మరో రెండు రోజులు గడువు పెంచినట్లు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సీహెచ్ఏ రాజేంద్ర ప్రసాద్ తెలిపారు. వర్సిటీ నుంచి సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 13తో దరఖాస్తుల స్వీకరణ ముగియగా, 15వ తేదీ సాయంత్రం వరకు పెంచినట్లు చెప్పారు. ఈ నాలుగేళ్ల ఇంటిగ్రేటెడ్ టీచర్ ఎడ్యుకేషన్ ప్రోగ్రాం కోర్సులో చేరేందుకు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నిర్వహించిన నేషనల్ కౌన్సెల్ ఫర్ ఎడ్యుకేషన్ టెస్ట్ -2023 పరీక్ష రాసిన వారు అర్హులని పేర్కొన్నారు. వారు సాధించిన మార్కుల స్కోర్ ఆధారంగా ఈ ప్రవేశాలు ఉంటాయని తెలిపారు. మొత్తం 110 సీట్లు ఉండగా, ఈ నెల 16న మెరిట్ లిస్ట్ సిద్ధం చేస్తామని అన్నారు. నేరుగా, రిజిస్టర్ పోస్టు ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు వివరించారు.

మల్లన్న సన్నిధిలో ఆకాశ దీప ప్రజ్వలన



రావివలస మల్లన్న సన్నిధిలో ఆకాశ దీప ప్రజ్వలన చేస్తున్న అర్చకులు

టెక్కలి: టెక్కలి మండలం రావివలస ఎండల మల్లికార్జున స్వామి ఆలయ సన్నిధిలో సోమవారం నుంచి కార్తీక మాసోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఆలయ అర్చకుడు టి.శివకుమార్, ఆలయ మాజీ కమిటీ చైర్మన్ సర్లాన సుధాకర్, పండితుడు సురేష్ ఆధ్వర్యంలో ఆకాశ దీప ప్రజ్వలనతో కార్తీక మాసోత్సవాలు ప్రారంభించారు. అంతకు ముందు స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు.

రిజిస్ట్రేషన్స్‌లో సరికొత్త పర్వం

కార్డ్ ప్రైమ్ 2.0

- నేటి నుంచి అమలులోకి..
- కొత్త విధానంలో 20 నిమిషాల్లోనే ప్రక్రియ పూర్తి

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

రిజిస్ట్రేషన్ సేవలు సరళమయ్యాయి. అవినీతి, అక్రమాలకు తావులేకుండా వినియోగదారులకు కచ్చితమైన సేవలు అందించేలా కార్డ్ ప్రైమ్ 2.0 ద్వారా నూతన రిజిస్ట్రేషన్ విధానం మంగళవారం నుంచి జిల్లాలో ప్రారంభం కానుంది. ఈ విధానంలో మధ్యవర్తులకు ఆస్కారం లేకుండా వినియోగదారుడే నేరుగా ఆన్‌లైన్‌లో డాక్యుమెంట్ తయారు చేసుకుని, ఆన్‌లైన్‌లో చూపించిన మేర స్టాంప్ డ్యూటీ, యూజర్ చార్జీలు, రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లిస్తే చాలు రిజిస్ట్రేషన్ జరిగిపోతుంది.

ఇప్పటివరకు రిజిస్ట్రేషన్ శాఖతో సంబంధం లేకుండా డాక్యుమెంట్ తయారీ, చలానా కట్టడం వంటివి బయట జరిగేవి. వీటిని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఇస్తే అక్కడ రిజిస్ట్రేషన్ చేస్తూ వస్తున్నారు. ఇదో పెద్ద ప్రహసనంగా ఉండేది. పైగా మధ్యవర్తుల ప్రమేయం ఎక్కువ. ఈ అవస్థలకు స్వస్తి పలుకుతూ కార్డ్ ప్రైమ్ 2.0 అనే నూతన విధానాన్ని ప్రభుత్వం తీసుకొచ్చింది.

ఏమిటీ 2.0..

- ఆన్‌లైన్‌లో డాక్యుమెంట్ తయారు చేసుకుని, ఆస్తి వివరాలు, పేరు, ఆధార్, సాక్షులు వంటి సమాచారాన్ని ఎంటర్ చేస్తే వెంటనే ఆస్తి మార్కెట్ విలువ, స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజు, యూజర్ చార్జీలు ఎంత కట్టాలో చూపిస్తుంది.
- ఆ సొమ్మును ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్, స్టాక్ హోల్డింగ్ ద్వారా చలానా కట్టే అవకాశం ఉంటుంది.
- అనంతరం రిజిస్ట్రేషన్ టైమ్ స్లాట్ బుక్ చేసుకుని, ఆ సమయానికి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్తే ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసిన డాక్యుమెంట్లు, వివరాలు ఆధారంగా పరిశీలించి, సబ్ రిజిస్ట్రార్ ఈ సిగ్నేచర్ ద్వారా రిజిస్ట్రేషన్ ప్రక్రియ ముగుస్తుంది.
- కేవలం 20 నిమిషాల్లోనే పని జరిగిపోతుంది.



పారదర్శకతకు పెద్దపీట

జిల్లాలో 13 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ప్రస్తుతం ఉన్నాయి. వీటి పరిధిలో రోజుకి సరాసరి 280 డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయి. ఒక్క శ్రీకాకుళం హెడ్ క్వార్టర్‌లోనే 30వరకు డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్ జరుగుతోంది. జిల్లా వ్యాప్తంగా ఒక్కరోజుకు దాదాపు రూ.80 లక్షల నుంచి రూ.90లక్షల వరకు ఆదాయం వస్తోంది. మధ్యవర్తుల ప్రమేయం లేకుంటే ఈ ఆదాయమంతా ప్రభుత్వానికే వస్తుంది. ఈ కొత్త విధానంతో జవాబుదారీతనం, పారదర్శకతకు పెద్ద పీట వేసినట్టు అవుతుందని రిజిస్ట్రేషన్ శాఖ స్పష్టత ఇస్తూ విస్తృత అవగాహన కల్పిస్తోంది.

అపోహలు-వాస్తవాలు

అపోహ: నూతన విధానంలో ప్రజలు దస్తావేజులు తయారు చేసుకోవడానికి ఎక్కువ కష్టపడాలి.

వాస్తవం : కొత్త పద్ధతి చాలా సులువు. ప్రజలు సులభంగా తమ పేర్లు, ఆస్తి వివరాలను నమోదు చేసి సురక్షితంగా దస్తావేజులను సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి పంపేందుకు వీలుగా సాఫ్ట్‌వేర్ రూపొందించారు.

అపోహ : రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఇచ్చే ఆన్‌లైన్ ప్రింట్లు ఆరు మాసాల్లో మాయం అయిపోతాయి. అవి తెల్ల కాగితాలుగా మిగిలిపోతాయి.

వాస్తవం : ప్రస్తుతం దస్తావేజు లేఖరి ముద్రిస్తున్న దస్తావేజులాగానే ఉంటాయి. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో కూడా దస్తావేజు లేఖరి ఏ విధంగా ప్రింటర్ ద్వారా ముద్రిస్తున్నారో అదే విధంగా కొత్త విధానంలో ముద్రించడం జరుగుతుంది. డిజిటల్ పద్ధతిలో ఒరిజినల్ డాక్యుమెంట్ వస్తుంది.

అపోహ : అదనపు సేవలు ఉండవు

వాస్తవం : వ్యవసాయ భూములు రెవెన్యూ శాఖ వెబ్‌ల్యాండ్‌లో అనుసంధానించడం వల్ల ఆస్తి మార్పిడి విషయంలో ఎలాంటి తప్పులు దొర్లడానికి అవకాశం ఉండదు. డబుల్ రిజిస్ట్రేషన్లు అరికడతాయి. వ్యవసాయేతర భూముల రిజిస్ట్రేషన్లు కూడా సురక్షితంగా ఉంటాయి.

అపోహ: సంప్రదాయ దస్తావేజుల ముద్రణ అదృశ్యమైపోయినట్టే. ఇకపై తెల్ల కాగితాలే దస్తావేజులు.

వాస్తవం : ఇది వాస్తవం కాదు. సబ్‌రిజిస్ట్రార్ ఆన్‌లైన్ ద్వారా పంపించిన దస్తావేజులను రిజిస్టర్ చేసిన తర్వాత స్టాంప్ పేపర్ మీద ముద్రించే సౌకర్యం ప్రభుత్వం కల్పించింది.

అపోహ: ఆన్‌లైన్ విధానంలో రిజిస్ట్రేషన్ చేసిన దస్తావేజులను రుణాల కోసం తనఖా సంస్థలు, బ్యాంకులు అంగీకరించవు.

వాస్తవం : ఆన్‌లైన్, ఈసైన్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసిన దస్తావేజులను తనఖా సంస్థలు, బ్యాంకులు తీసుకుంటాయి.

అపోహ : ఆన్‌లైన్ ద్వారా దస్తావేజుల వివరాలను నింపేటప్పుడు ఏదైనా తప్పులు దొర్లితే వాటిని సవరించడానికి అవకాశం ఉండదు.

వాస్తవం : ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసిన దస్తావేజులలో ఏదైనా తప్పులు దొర్లితే సులువుగా సవరణ చేసుకునే వెసులుబాటు ప్రభుత్వం కల్పించింది.

అపోహ : నూతన రిజిస్ట్రేషన్ విధానంలో అమలవుతున్న ఈ సిగ్నేచర్ చట్టం పరిధిలో చెల్లుబాటు కాదు. న్యాయస్థానాల్లోనూ సాక్ష్యాల విలువ ఉండదు.

వాస్తవం : ఆధార్ ఆధారితమైన సంతకం కావడంతో ప్రస్తుతం ఫిజికల్ సంతకాల కంటే సురక్షితమైన సంతకాలుగా ఉంటాయి. భారతీయ సాక్ష్యాల చట్టానికి అనుగుణంగానే ఉంటాయి.

అపోహ : ఇంకుతో పెట్టిన సంతకాలు ఉన్నవే ఒరిజనల్ దస్తావేజులు, ఈ సైన్ చేసినవన్నీ జిరాక్స్ పత్రాలు.

వాస్తవం : ఈ సైన్ చేసిన దస్తావేజులు చట్టబద్ధమైనవి.

అపోహ : ఈ స్టాంపింగ్ విధానం ద్వారా పాత తేదీలతో సృష్టించే అవకాశం పెరుగుతుంది.

వాస్తవం : ఆన్‌లైన్‌లో ప్రతి స్టాంప్ అమ్మకం ద్వారా పారదర్శకత పెరిగింది. పాత తేదీలతో సృష్టించే విధానానికి చెక్ పెట్టడానికే ఈ స్టాంపింగ్ విధానం అమల్లోకి వచ్చింది.

అపోహ : దస్తావేజుల తయారీలో ఆధార్, ఓటీపీలు ఒక్కోసారి జనరేట్ కావు. దానివల్ల రిజిస్ట్రేషన్‌కు ప్రజలు దూరమయ్యే అవకాశం ఉంది.

వాస్తవం : ఓటీపీ ఆధారిత రిజిస్ట్రేషన్ వివరాల నమోదు తప్పనిసరి కాదు. ప్రజలు వారి పేర్ల ముందు ఆధార్ నంబర్ రాస్తే చాలు. ఓటీపీతో పనేలేదు.

అపోహ : రిజిస్ట్రేషన్ విధానాల్లో ప్రభుత్వ భూములు నిషేధిత ఆస్తులు రిజిస్ట్రేషన్ అయ్యే ప్రమాదం ఉంది.

వాస్తవం : ఇప్పటికే అమలులో ఉన్న నిషేధిత ఆస్తుల నమోదు నియంత్రణ విధానాలు ఈ విధానంలో ఎంతో పటిష్టంగా మెరుగుపర్చింది. నిషేధిత ఆస్తులు, ప్రభుత్వ భూములు రిజిస్ట్రేషన్ చేసేందుకు అవకాశం ఉండదు.

అపోహ: సబ్ రిజిస్ట్రార్ సంతకాలు దస్తావేజులపై ఉండవు. దస్తావేజు రిజిస్టరైనట్టు ఆధారం లేనట్టే.

వాస్తవం : దస్తావేజుల్లో కక్షిదారులతో పాటు దాన్ని రిజిస్ట్రేషన్ చేసిన సబ్ రిజిస్ట్రార్ల సంతకాలు కూడా ఈ సైన్ ద్వారా తీసుకుంటారు. ఏ రోజు ఎవరు ఏ సమయంలో రిజిస్టర్ చేశారో తదితర వివరాలన్నీ దస్తావేజు వెనక ముద్రిస్తారు.

పారదర్శకత పెరుగుతుంది

భూముల క్రయవిక్రయాల్లో పారదర్శకతను పెంచి, వారి ఆస్తులను పరిరక్షించేందుకు కొత్త విధానం దోహదపడుతుంది. దస్తావేజును స్వతహాగా ఎవరికి వారే తయారు చేసుకుని, ఎక్కడ కావాలంటే అక్కడ రిజిస్ట్రేషన్ స్లాట్‌ను బుక్ చేసుకోవచ్చు. సులువుగా తక్కువ సమయంలోనే రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తవుతుంది. అపోహాలు వీడి ఈ నూతన విధానానికి డాక్యుమెంట్ రైటర్లు, కక్షిదారులు సహకరించాలి.

– కిల్లి మన్మధరావు, జిల్లా రిజిస్ట్రార్, శ్రీకాకుళం





శ్రీకాకుళంలో దీపావళి సంబరాలు

చీకటిలోన.. వెలుగుల వాన

చిమ్మ చీకటి వేళ వెలుగుల వానలు కురిశాయి. అమావాస్య పూట పున్నమి వెలుగులను తలపిస్తూ మతాబులు ఇంటింటా వెలిగాయి. దీపావళి సంబరాన నవ్వులన్నీ దివ్వెలై విరబూశాయి. జిల్లావ్యాప్తంగా దీపాల పండగ గుండె నిండుగా జరుపుకున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్ శ్రీకాకుళం

సైబీరియాలో తేలి.. నీలాపురంలో వాలి..!

తేలినీలాపురం.. సైబీరియా పక్షుల విడిది కేంద్రం. పురిటి కోసం పక్షులు ఎంచుకున్న ప్రాంతం. అల్లంత దూరం నుంచి పక్షులను చూడడం, చెట్టుపై వాలిన వాటి అందాలు గమనించడం సహజం. అవే పక్షులను దగ్గరగా చూస్తే..? వాటి ఆహారం, ఆహార్యం, అలవాట్లను తెలుసుకోగలిగితే..? చింత, రావి, తుమ్మ, గంద్ర, వెదురుపై వాలే అతిథి విహంగాల జీవన క్రమాన్ని అర్థం చేసుకోగలిగితే..? ఎంత బాగుంటుందో కదా. ఆ సరదాను తీర్చడానికి తేలినీలాపురంలో పక్షుల మ్యూజియాన్ని ఏర్పాటు చేశారు. అంతే కాకుండా ఆహర అన్వేషణ, ఆవాసాలపై జీవించే క్రమంలో ఆయా పక్షుల ప్రత్యేకతలను వివరంగా తెలియజేస్తూ పక్షుల బొమ్మలను ఏర్పాటు చేశారు. -శ్రీకాకుళం డెస్క్

- తేలినీలాపురం విదేశీ పక్షుల కేంద్రంలో పక్షుల మ్యూజియం
- పక్షుల ఉనికి తెలుపుతూ బొమ్మలు ఏర్పాటు
- ఏటా కార్తీకమాసం పిక్నిక్ సీజన్‌లో పర్యాటకుల సందడి





మ్యూజియంలో ఏర్పాటుచేసిన పక్షుల నమూనాలు

పెలికాన్

పెలికాన్ బాతు జాతికి చెందిన పక్షి. దీని బరువు సుమారు 8 కిలోలు ఉంటుంది.

- దీని నోరు పొడవు సుమారు 14 సెంటీ మీటర్లు.
- దీని రెక్కల పొడవు సుమారు 118 ఇంచీలు, రోజుకు 4 కిలోల చేపల్ని తింటుంది. ఒకేసారి 2 కిలోల బరువు కలిగిన చేపను సునాయాశంగా తినగలిగే సామర్థ్యం ఉంది.
- దీని గుడ్డు బరువు సుమారు 150 గ్రాములు. ప్రతీ సీజన్‌కు 4 గుడ్లను మాత్రమే పెడుతుంది. దీని గుడ్డు 28 రోజుల్లో పిల్లగా పరిపక్వత చెందుతుంది.
- 3 నెలల్లో పిల్ల తల్లిగా మారుతుంది. దీని దవడ సంచి ఆకారంలో ఉంటుంది. గంటకు 100 కిలో మీటర్ల వేగంతో పయనిస్తాయి.
- రోజుకు సుమారు 4 సార్లు బయటకు వెళ్తూ ఆహారాన్ని తీసుకువస్తాయి. పెలికాన్ దవడ సంచి ఆకారంలో ఉంటుంది. ఈ దవడలో సుమారు 4 కిలోల వరకు చేపల్ని నిల్వ చేయగలవు. పిల్లలకు ఆహారాన్ని నోటి ద్వారా అందజేస్తాయి. దీని జీవిత కాలం సుమారు 29 సంవత్సరాలు.



పెయింటెడ్ స్టార్క్

పెయింటెడ్ స్టార్క్ కొంగ జాతికి చెందిన పక్షి. దీని బరువు సుమారు 5 కిలోలు ఉంటుంది.

- దీని రెక్కల పొడవు 63 ఇంచీలు, ఇవి చిన్న చేపలు, పురుగులు, నత్తలు తింటాయి. కేవలం పావు కిలో వరకు మాత్రమే నోటిలో ఆహారాన్ని నిల్వ చేయగలుగుతాయి. తీసుకు వచ్చిన ఆహారాన్ని గూడు మీద వేస్తే పిల్లలు తింటాయి.
- దీని నోటి పొడవు సుమారు 16 సెంటీ మీటర్లు. ఆహారం కోసం రోజుకు 2 సార్లు బయటకు వెళ్తుంటాయి. దీనికి సాధారణ దవడ మాత్రమే ఉంటుంది.
- దీని గుడ్డు సుమారు 75 గ్రాములు. ఇవి ఒక సీజన్‌లో 4 గుడ్లు మాత్రమే పెడతాయి. 28 రోజుల్లో గుడ్డును పిల్లగా పరిపక్వత చేస్తుంది. పిల్ల తల్లిగా మారాలంటే సుమారు 3 సంవత్సరాలు కాలం పడుతుంది. దీని జీవిత కాలం సుమారు 29 సంవత్సరాలు.

మ్యూజియం చూసొద్దామా...

ఎక్కడ ఉంది	జిల్లా కేంద్రానికి ఎంత దూరం	రవాణా	సందర్శనీయ వేళలు
టెక్కలి సమీపంలోని తేలినీలాపురం	70 కిలోమీటర్లు	టెక్కలి వరకు రైలు నదుపాయం ఉంది. బస్సు నదుపాయం కూడా ఉంది. టెక్కలి నుంచి పూండి మార్గంలో ఉన్న ఈ ప్రదేశానికి బస్సులు, ఆటోలు కూడా ఉన్నాయి.	ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు..

120 రకాల పక్షుల్లో కొన్నింటి ప్రత్యేకతలు..



- **పొడుగు ముక్కు ఉల్లంకి:** ఈ పక్షి మట్టిలో ఆహార అన్వేషణకు బురద మట్టి ఇసుక నేలలో అనేక రకాలైన చిన్న పురుగులను కొక్కెం వంటి ముక్కు తో వేట కొనసాగిస్తుంది. ఈ పక్షి నమూనా మ్యూజియంలో ఏర్పాటు చేశారు.



- **తెడ్డు మూతి కొంగ:** ఈ పక్షి మూతి చెంచా ఆకారంలో ఉంటుంది. నీటి అడుగున ఉన్న చిన్న జీవులను వేటాడుతుంది. అర్ధ చంద్రాకారంలో గల మూతితో వేట కొనసాగిస్తుంది.



- **పాము బాతు :** బల్లెం వంటి ముక్కు ఆకారంతో ఈ పక్షి వేట కొనసాగిస్తుంది. మట్టి, నీటిలో పొడుచుకుంటూ ఆహారాన్ని సేకరిస్తుంది.



- **రాజహంస:** జల్లెడ మాదిరిగా ఉన్న ముక్కు కలిగిన ఈ రాజహంస సూక్ష్మ జీవులను సునాయాశంగా వేటాడుతుంది. ఈ పక్షి ముక్కులో ఒక రకమైన వడపోత పరికరం బిగించి ఉన్నట్లు ఉంటుంది.



మ్యూజియంలో ఏర్పాటుచేసిన నమూనాలు



- **నత్తగుల్ల కొంగ:** నత్తలను వేటాడడంలో ఈ పక్షి ముక్కు ఎంతో షార్ప్‌గా ఉంటుంది. నత్తలను గట్టిగా పట్టుకోవడంతో ఆహారాన్ని సంపాదించుకుంటాయి.

క్లుప్తంగా

జిల్లా అథ్లెటిక్స్ క్రీడాకారుల ఎంపిక రేపు

శ్రీకాకుళ న్యూకాలనీ: జిల్లా స్కూల్‌గేమ్స్ అండర్–19 బాలబాలికల అథ్లెటిక్స్ సెలెక్షన్స్ ట్రయల్స్ బుధవారం జరగనున్నాయని జిల్లా అండర్–19 స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ అధ్యక్షుడు, డీపీఈఓ కోట ప్రకాశరావు, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి, పీడీ బీవీ రమణ తెలిపారు. శ్రీకాకుళం జిల్లా కేంద్రంలోని కోడిరామ్మూర్తి స్టేడియం క్రీడా ప్రాంగణం వేదికగా బుధవారం ఉదయం 9 గంటల నుంచి ఈ ఎంపికల ప్రక్రియ ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. ఎంపికలకు హాజరయ్యే క్రీడాకారులు తమ జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డు, కళాశాల ప్రిన్సిపాల్ ధ్రువీకరించిన స్టడీ సర్టిఫికెట్‌ను తమ వెంట విధిగా తీసుకురావాలని వారు కోరారు. మరిన్ని వివరాలకు 94415 69785 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

నేడు జిల్లా అండర్–19 హ్యాండ్‌బాల్ జట్ల ఎంపికలు

శ్రీకాకుళ న్యూకాలనీ: జిల్లా స్కూల్‌గేమ్స్ అండర్–19(ఇంటర్మీడియెట్, డిగ్రీ ఫస్టియర్) బాలబాలికల హ్యాండ్‌బాల్ ఎంపిక పోటీలు మంగళవారం జరగనున్నాయని జిల్లా అండర్–19 స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ అధ్యక్షులు, డీపీఈఓ కోట ప్రకాశరావు, కార్యదర్శి బీవీ రమణ తెలిపారు. శ్రీకాకుళం కోడిరామ్మూర్తి స్టేడియం మైదానం వేదికగా 14వ తేదీన ఉదయం 10 గంటల నుంచి ఈ ఎంపికల ప్రక్రియ ప్రారంభమవుతుందని చెప్పారు. ఎంపికలకు హాజరయ్యే క్రీడాకారులు 19 ఏళ్లలోపు వయస్సు కలిగి ఉండాలని స్పష్టంచేశారు. తమ జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డు, స్టడీ సర్టిఫికెట్‌తో ఎంపికలకు హాజరుకావాలని వారు కోరారు.

బాలల హక్కుల పరిరక్షణకు ప్రత్యేక కార్యక్రమాలు

శ్రీకాకుళం అర్బన్: నవంబర్, డిసెంబర్ నెలల్లో బాలల హక్కుల పరిరక్షణకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని జిల్లా మహిళ, శిశు సంక్షేమ, సాధికారత అధికారి బి.శాంతిశ్రీ పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటనలో తెలియజేశారు. బాలల దినోత్సవం సందర్భంగా 14వ తేదీ నుంచి 20వ తేదీ బాలల హక్కుల దినోత్సవం వరకు వివిధ స్థాయిల్లో కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. నవంబర్ 20 నుంచి డిసెంబర్ 10 వివిధ ప్రాంతాల్లో బాల కార్మికులను గుర్తించి వారిని రక్షించే కార్యక్రమం నిర్వహిస్తామని పేర్కొన్నారు. వీటితో పాటుగా బాల్య వివాహాల నిర్మూలనకు ప్రజల్లో అవగాహన కల్పించడానికి ర్యాలీలు, ప్రతిజ్ఞలు మొదలైన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు.

పెద్ద మనస్సు చాటుకున్న స్నేహితులు



ఆర్థిక సాయం చేస్తున్న స్నేహ బృందం

ఇచ్ఛాపురం రూరల్: బోన్‌మేరో వ్యాధితో బాధపడుతున్న కవల పిల్లలు శివంగి హర్షవర్ధన్, హర్షితలకు వారి తండ్రి మిత్రులు చేయూత అందించారు. పిల్లల పరిస్థితిపై గత నెల 30న 'సాక్షి'లో ప్రచురితమైన 'చిన్ని ప్రాణాలకు ఆపద' కథనానికి ఇప్పటికే దాతలు స్పందించి సుమారు మూడున్నర లక్షల వరకు సమకూర్చారు. చిన్నారుల తండ్రి కూర్మారావుతో చదువుకున్న వారు స్పందించి తమ వంతుగా రెండున్నర లక్షల రూపాయలు పోగుచేశారు. భగత్‌సింగ్ యూత్ సభ్యులు, స్నేహితులు బడే జయబాబు, సూర్య రమేష్(ఎల్‌ఐసీ), సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ వేణులు సోమవారం ఈ నగదును కుటుంబ సభ్యులకు అందజేశారు.

ఆదిత్యుని సన్నిధిలో కంప్ట్రోలర్ అండ్ ఆడిట్ అధికారి



ప్రియాంక నశీనాకు అందజేస్తున్న ట్రస్ట్ బోర్డు సభ్యుడు గోవిందరావు

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామిని కంప్ట్రోలర్ అండ్ ఆడిట్ జనరల్ ఆఫ్ అకౌంట్స్ రాష్ట్ర ఇన్‌చార్జి ప్రియాంక నశీనా కుటుంబసమేతంగా సోమవారం ఉదయం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారికి ఆలయ సంప్రదాయం ప్రకారం పాలకమండలి సభ్యుడు లుకలాపు గోవిందరావు, అర్చకులు రంజిత్ శర్మలు గౌరవ స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. వారు సూర్యనమస్కార పూజల్లో కూర్చొని సంకల్పం చెప్పించుకున్నారు.

ఏపీ అభివృద్ధికి రూ.24 వేల కోట్లు కేటాయింపు

ఆదిత్యుని దర్శనం అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రాభివృద్ధికి కేంద్రం తరపున ఈ ఏడాది రూ.24వేల కోట్ల వరకు నిధులు కేటాయించినట్లు పేర్కొన్నారు. ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో రేగిడిఆమదాలవలస మండల పరిధిలో సుమారు 12 వేల ఎకరాలకు సాగునీరు అందేలా సాయన్న చానెల్‌కు రాష్ట్ర ప్రభుత్వం రూ.16 కోట్లను మంజూరు చేసినట్లుగా ఆమె ప్రకటించారు. స్థానిక ప్రజాప్రతినిధుల చొరవతోనే ఈ నిధులు మంజూరయ్యాయని, త్వరలోనే టెండర్లు పిలవనున్నామని ప్రియాంక నశీనా ప్రకటించారు.

ఆఫ్‌షోర్ పనులు షురూ



జేసీబీతో జరుగుతున్న కాంక్రీటు శ్లాబు పనులు

- ఇప్పటికే 400 మీటర్లకు చేరుకున్న కుడికాలువ తవ్వకం
- ఏడు శ్లాబులు పూర్తి, మరో వారంలో మూడు శ్లాబులు

కాశీబుగ్గ: ఆఫ్‌షోర్ నిర్మాణ పనులు జోరందుకుంటున్నాయి. ప్రస్తుతం కాంక్రీట్ పనులు కొనసాగుతున్నాయి. ఆఫ్‌షోర్ ప్రాజెక్టుకు ఇరువైపులా ముఖ్యమైన ఎడమ, కుడి కాలువలకు అన్ని రకాల పనులు కార్యరూపం దాల్చినప్పటికీ ఎడమకాలువ ప్రారంభం వద్ద రేగులపాడు గ్రామస్తులు ఇంకా ఖాళీ చేయకపోవడంతో చిన్నపాటి సమస్యలు పరిష్కరించాల్సి ఉంది. ఎడమకాలువ పనులు ఆలస్యం అవుతున్నాయి. అయితే కుడికాలువకు సంబంధించి అన్ని రకాలు అనుమతులు, రైతులు సమస్యలు పరిష్కారం కావడంతో శరవేగంగా పనులు జరుగుతున్నాయి. శుక్రవారం నాడు మదుముకు సంబంధించి శ్లాబ్ వేశారు.

కుడికాలువ పనులు ప్రారంభం

మహేంద్ర తనయ ఆఫ్‌షోర్ ప్రాజెక్టు వద్ద ఉన్న కుడి కాలువ పనులు ఈ ఏడాది ప్రారంభమయ్యాయి. కుడి కాలువ మదుము నిర్మాణానికి సుమారు 77.75 మీటర్లు పొడవులో మట్టిని తొలగించి అదే పొడవులో సుమారు 30 అడుగులు గోతిని తవ్వి



పూర్తయిన ఏడు శ్లాబుల విభాగం

బలమైన పునాదులు వేశారు. అనంతరం కుడికాలువ మదుము (రైట్‌హెడ్ స్లూయిస్) నిర్మాణ దశ కష్టతరంగా మారింది. వరుసగా వర్షాలు కురవడంతో ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయి ఇబ్బందులు ఎదురయ్యాయి. వానలు తగ్గడంతో తిరిగి పనులు చేపట్టారు. 77.75 మీటర్లు మదుముకు పది విభాగాలు కాంక్రీట్ శ్లాబులు వేస్తూ వస్తున్నారు. ఇప్పటి వరకు ఏడు శ్లాబులు పూర్తి కాగా ఇంకా మూడు శ్లాబులను వారం రోజుల్లో పూర్తిచేయనున్నారు. ఆఫ్‌షోర్ ప్రాజెక్టు కుడికాలువ మదుము పనులు పూర్తయితే కొన్ని నెలల పాటు పూర్తి వాటరింగ్‌చేసి అనంతరం దానిపై శాండు పొర, మట్టి పొరలు, రాతికట్టుతో పూర్తిగా కప్పనున్నారు.

ప్రస్తుతం మదుముకు వంద మీటర్లు దూరం నుంచి బడగాం గ్రామం పెరటిమీదుగా కాలువ పనులు

మూడు నెలల్లో పూర్తి చేస్తాం

మహేంద్రతనయ ఆఫ్‌షోర్ ప్రాజెక్టు పనుల్లో ముందుగా కుడికాలువ పనులు చేపడుతున్నాం. ప్రస్తుతం కాంక్రీటు పనులు జరుగుతున్నాయి. 77.75 మీటర్లు మదుము పూర్తి కావడానికి మూడు నెలలు సమయం కేటాయించాలి. అనంతరం 70 మీటర్లు ఎత్తు వరకు దాన్ని కప్పి ఉంచుతాం. అనంతరం లోపల, బయట దట్టమైన మిషనరీలను ఏర్పాటు చేస్తాం. ఆటోమేటెడ్‌గా విద్యుత్‌తో నడిచే యంత్రాలను అమరుస్తాం. ఇది పూర్తికాగానే ఎడమ కాలువ పనులు చేపడతాం.

– కె.శ్రీకాంత్, ఈఈ, వంశధార ప్రాజెక్టు



బడగాం వరకు చేరుకున్న కుడికాలువ పనులు

జోరుగా సాగుతున్నాయి. ఈ కాలువ సుమారు 10 కిలోమీటర్లు 150 మీటర్లు పొడవు ఆరు మీటర్లు వెడల్పు, రెండు వైపులా కట్టలతో కలుపుకుంటే సుమారు 18 మీటర్లు వెడల్పు ఉంటుంది. ఇప్పటికీ నాలుగు వందల మీటర్లు పొడవైన కుడికాలువ నిర్మాణ పనులు సాగాయి.

వరి కోతలు అయిపోతే పంటపొలాల మీదుగా కాలువ నిర్మాణ పనులు జరుగుతాయి. ఆఫ్‌షోర్ ప్రాజెక్టులో 24.600 ఎకరాలకు నీరు అందనుండగా ఒక్క కుడి కాలువ పూర్తయితే 12,400 ఎకరాలకు సాగునీరు అందుతుందని అధికారులు చెబుతున్నారు. ఆఫ్‌షోర్ ప్రాజెక్టులో నీటి నిల్వ 1.860 టీఎంసీలు ఉండనుంది. కుడి కాలువ నుండి 136 క్యూసెక్కుల నీటిని విడుదల చేయడానికి వీలుంటుంది.

● శిరీష.. గో బ్యాక్



గౌతు శిరీష వాహనాన్ని అడ్డుకుంటున్న మంచినీళ్లపేట వాసులు



- ఊరి పొలిమేరలో అడ్డుకున్న మంచినీళ్లపేట గ్రామస్తులు
- పరామర్శల రాజకీయం మానుకోవాలని హితవు

వజ్రపుకొత్తూరు: టీడీపీ నాయకురాలు గౌతు శిరీషకు మంచినీళ్లపేటలో చేదు అనుభవం ఎదురైంది. ఆ ఊరి పొలిమేరలోనే ఆ గ్రామస్తులు ఆమెను అడ్డుకుని గో బ్యాక్ నినాదాలు చేశారు. వినాయక చవితి సందర్భంగా గ్రామానికి చెందిన కారి లింగరాజు, కారి పుణ్యవతిల మధ్య ఘర్షణ జరిగింది. ఆ కొట్లాటలో తనకు తాను గాయం చేసుకుని లింగరాజు ఆస్పత్రిలో చేరారు. ఆ సమయంలో గౌతు శిరీష స్థానిక మాజీ సర్పంచ్ గుళ్ల చిన్నారావు, గోవింద పాపారావులతో కలిసి ఆస్పత్రికి వెళ్లి వైఎస్సార్ సీపీ గూండాలు టీడీపీ కార్యకర్తపై దాడి చేశారంటూ పత్రికల్లో స్టేట్‌మెంట్ ఇచ్చారు. దీంతో మంచినీళ్లపేట గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నేతలు, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు వంక రాజు, స్థానిక సర్పంచ్ వంక సత్యరాజులు, పార్టీ కార్యకర్తలు, గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం ఊరిమీదుగా వెళ్తున్న ఆమెను అడ్డుకుని నిజం తెలుసుకోకుండా ఇలా రాజకీయం చేయడం సరికాదని అన్నారు. దీంతో దాదాపు గంట సేపు గందరగోళ పరిస్థితి ఏర్పడింది. వజ్రపుకొత్తూరు పోలీసులు రంగప్రవేశం చేసి ఇరువర్గాలకు నచ్చజెప్పారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

నరసన్నపేట: పొందర కులాన్ని రాష్ట్రమంతా బీసీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంపై పొందర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సోమవారం సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. మండలంతోపాటు జిల్లాలో ఉన్న పొందర సంక్షేమ సంఘం ప్రతినిధులు మబగాంలో ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ సమక్షంలో పాలాభిషేకం చేసి తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పొందర కార్పొరేషన్ చైర్ పర్సన్ రాజాపు హైమావతి, పొందర సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాజాపు అప్పన్నలు మాట్లాడుతూ 2008 లో వైఎస్సార్ హయాంలో పొందర్లను బీసీ–ఎగా గుర్తించి జీఓ జారీ చేశారని, అయితే ఉత్తరాంధ్ర మూడు జిల్లాల్లో ఉన్న పొందర్లకే ఈ సర్టిఫికెట్లు వచ్చేవని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా పొందర్లకు బీసీ–ఏ సర్టిఫికెట్ వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని పలు మార్లు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు కోరగా ఈ నెల 10న జీఓ నంబర్ 25 జారీ చేస్తూ పొందర కులానికి రాష్ట్ర వ్యాప్తంగా బీసీ–ఏ వర్తించేలా చర్యలు తీసుకున్నారన్నారు. ఈ జీఓ పొందర



సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న పొందర కార్పొరేషన్ చైర్‌పర్సన్, తదితరులు

కులస్తులకు ఎంతో మేలు చేకూర్చుతుందని అభిప్రాయపడ్డారు. ముఖ్యమంత్రికి తమ సమస్యలు తెలియజేయటంలో నరసన్నపేట ఎమ్మెల్యే, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ ఎంతో కృషి చేశారని కొనియాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను హైమావతి, అప్పన్న సత్కరించారు. సంక్షేమ సంఘం ప్రతినిధులు మురళీనాయక్, పి.లక్ష్మణరావు, పి.శ్రీనివాసరావు, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సాధికార బస్సుయాత్ర షెడ్యూల్ విడుదల

నరసన్నపేట: నరసన్నపేటలో సామాజిక సాధికార బస్సు యాత్ర నిర్వహణకు ఏర్పాట్లు చురుగ్గా జరుగుతున్నాయి. బస్‌యాత్ర షెడ్యూల్‌ను ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ సోమవారం సాయంత్రం విడుదల చేశారు. ఆ మేరకు.. నరసన్నపేట, పోలాకి మండలాల్లో బస్సు యాత్ర సాగుతుంది. బుధవారం ఉదయం 12 గంటలకు మబగాంలో ప్రెస్‌మీట్ నిర్వహిస్తారు. 12.30 నుంచి 1.30 వరకూ లంచ్ బ్రేక్, 1.30 కి మబగాంలో బస్‌యాత్ర ప్రారంభవుతుంది. 1.45 గంటలకు కిల్లాం చేరుకుంటుంది. 2 గంటలకు ఈదులవలస కూడలికి వస్తుంది. 2.15 నరసన్నపేట టౌన్‌లోని దేశవానిపేట కూడలికి, 2.30 కి పల్లిపేట జంక్షన్‌కు బస్ యాత్ర చేరుకుంటుంది. 2.45 గంటలకు వైఎస్సార్ కూడలి వద్దకు వస్తుంది. అక్కడ వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తారు. అనంతరం లక్ష్మీ టాకీస్ వద్ద సభా ప్రాంగణానికి 3 గంటలకల్లా చేరుకుంటారు. 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ సభ నిర్వహిస్తారు.

రెండో విడత బస్సు యాత్రకు ఏర్పాట్లు

నరసన్నపేట: రెండో విడత సామాజిక సాధికార బస్సు యాత్రలకు ఏర్పాట్లు చేస్తున్నామని వైఎస్సార్ సీపీ ఉత్తరాంధ్ర కోఆర్డినేటర్, ఏపీ శాసన మండలి ప్రభుత్వ విప్ లేళ్ల అప్పిరెడ్డి అన్నారు. నరసన్నపేట నుంచే రెండో విడత ప్రారంభం చేస్తున్నామని తెలిపారు. ఆ ఏర్పాట్లపై ఆయన సోమవారం ఆరా తీశారు. ఎమ్మెల్యే, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్, ఎమ్మెల్సీ పీవీవీ సత్యనారాయణ రాజు(పెన్మత్స సురేష్ బాబు), నవరత్నాల ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ అంకం రెడ్డి నారాయణ మూర్తిలతో కలిసి సభా వేదిక స్థలాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మొదటి విడత సభలు అన్నీ విజయవంతం అయ్యాయని అన్నారు. రెండో విడతలో మరింత పగడ్బందీగా యాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు జరిగిన యాత్రలను జయప్రదం చేశారని తెలిపారు. సీఎం వైఎస్ జగన్ సారథ్యంలో అన్ని వర్గాలకు సమన్యాయం జరుగుతోందని పేర్కొన్నారు. నరసన్నపేట ప్రధాన రహదారిపై కాలేజీ రోడ్డు కూడలి వద్ద సభ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే



నరసన్నపేటలోబస్ యాత్ర సభా వేదిక స్థలాన్ని పరిశీలిస్తున్న అప్పిరెడ్డి, ఎమ్మెల్సీ సురేష్ బాబు, ధర్మాన కృష్ణదాస్ తదితరులు

కృష్ణదాస్ తెలిపారు. వీరి వెంట కళింగ వైశ్య కార్పొరేషన్ చైర్మన్ అంధవరపు సూరిబాబు, ఆలిండియా బీసీ ఫెడరేషన్ ఉత్తరాంధ్ర అధ్యక్షుడు ఎన్ని ధనుంజయరావు, డీసీసీబీ చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, పోలాకి జెడ్పీటీసీ ధర్మాన కృష్ణ చైతన్య, నరసన్నపేట ఎంపీపీ ఆరంగి మురళి, సర్పంచ్ బూరల్లి శంకర్, జెడ్పీటీసీ మాజీ సభ్యులు చింతు రామారావు తదితరులు పాల్గొన్నారు.

సరదాలో చిన్నపాటి అపశ్రుతులు

శ్రీకాకుళం క్రైమ్ : దీపావళి నాడు జిల్లావ్యాప్తంగా పలు చోట్ల అగ్ని ప్రమాదాలు సంభవించాయి. అయితే ఎక్కడా ఎవరికీ ప్రాణాపాయం కలగలేదు. ఆస్తినష్టం మాత్రం రూ.5,81,500 సంభవించిందని శ్రీకాకుళం అగ్నిమాపక అధికారి జడ్డు మోహనరావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం..

- టెక్కలి మెయిన్‌రోడ్డులో ఉన్న దుకాణాల్లో క్రాకర్స్ కాలి రూ. 3 లక్షల వరకు నష్టం వాటిల్లింది.
- శ్రీకాకుళంలోని హయాతీ నగర్ జానకిరామ కాలనీ కురిటి అచ్చిబాబు ఇంటిలో ఎలక్ట్రికల్ షార్ట్‌సర్క్యూట్ వల్ల వస్తువులు కాలి రూ. లక్ష వరకు నష్టం వచ్చింది.
- శ్రీకాకుళంలోని ఆర్టీసీ కాంప్లెక్సు వద్ద అర్ధరాత్రి రెండున్నర గంటలకు బాసరావు సత్యనారాయణ పళ్ల దుకాణాలు, తోపుడు బళ్లు కాలి రూ.65 వేల వరకు నష్టం సంభవించింది.
- పోలాకి మండలంలోని దీర్ఘాశి బయట ఉంచిన రూ. 30 వేలు విలువైన ఇంటి వస్తువులు కాలిపోయాయి.
- కొత్తూరు మండలం వెంకటాపురం కాలనీలో సన్నాయిబోయిన దాసు పూరిల్లు కాలింది.
- సోంపేట బెర్నవాడ కాలనీలో ఆరుబయట నిల్వలు కాలాయి.
- పొందూరు రాపాకలో గృహం కాలింది.
- అరసవిల్లి ఆదిత్యానగర్ కాలనీలోని బి.కృష్ణ తన



ఆర్టీసీ కాంప్లెక్సు సమీపంలో పళ్ల దుకాణం వద్ద మంటలు ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

కొబ్బరి చెట్లు కాలిపోయాయని ఫిర్యాదు చేశారు.

- డేఅండ్‌నైట్ కూడలి లైఫ్ హాస్పిటల్ వెనుక నాయుడు మెస్‌లో ఆరుబయట నిల్వలు, కృష్ణా పార్కు వెనుక జీన్స్ మేళా పక్కన ఆరుబయట నిల్వలు, చినబొందిలీపురం శ్రీ సాయి రెసిడెన్సీ దరి యడ్ల రమాదేవి ఇంట్లో ఎలక్ట్రిక్ షార్ట్ సర్క్యూట్ కారణంగా వాషింగ్ మెషిన్ తదితర వస్తువులు కాలిపోయాయి.
- రిమ్స్ ఆస్పత్రి సమీపంలోని బలగ వార్డు–1 సాధు అప్పన్న తాలుకా గడ్డివాము కాలింది.
- సోమవారం రాత్రి ఏడు గంటలకు జిల్లా పరిషత్ సమీపంలోని గడ్డివాము కాలి బూడిదైంది.
- బాణసంచాలో తారాజువ్వలు, ఆకాశదీపాలు కాలి ఇలా ప్రమాదాలు సంభవించాయని జిల్లా అగ్నిమాపకాధికారి జె.మోహనరావు తెలిపారు.

ఆటో ఢీ: వ్యక్తికి తీవ్రగాయాలు

శ్రీకాకుళం క్రైమ్ : స్థానిక డేఅండ్‌నైట్ కూడలి సమీపంలో నడుచుకుంటూ వెళ్తున్న ఓ వ్యక్తిని ఆటో ఢీకొట్టడంతో తీవ్రగాయాలైనట్లు ట్రాఫిక్ ఎస్‌ఐ పీవీ రమణ పేర్కొన్నారు. ఎస్‌ఐ చెప్పిన వివరాల మేరకు రాయివీధికి(పెదరెల్లివీధి సమీపంలో) చెందిన పెంట కృష్ణ (47) డేఅండ్‌నైట్ కూడలి సమీపంలో ఉన్న ట్రెండ్స్ నుంచి వరం మోటార్స్ వైపు డివైడర్‌పై నుంచి రోడ్డు క్రాస్ చేస్తున్నాడు. అదే సమయంలో డేఅండ్‌నైట్ నుంచి ఏడురోడ్ల కూడలికి వెళ్తున్న ఆటో ఢీకొనడంతో ఒక్కసారిగా రోడ్డుపై పడిపోయాడు. దీంతో కృష్ణకు తల వెనుక బలమైన గాయం తగలడమే కాక పెదవి కూడా చిట్లింది. కాసేపటికే ఆయన స్పృహ కోల్పోవడంతో హుటాహుటిన ఆటోలో రిమ్స్‌కు తరలించారు. గాయం పెద్దది కావడంతో రిమ్స్ నుంచి అతని కుటుంబ సభ్యులు మెడికవర్‌కు తీసుకువెళ్లారు. భార్య మంగమ్మ ఇచ్చిన స్టేట్‌మెంట్ ఆధారంగా కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రమణ తెలిపారు.

పంచారామ క్షేత్రాలకు ప్రత్యేక బస్సులు

వివరాల కోసం సంప్రదించాల్సిన నంబర్లు		
డిపో మేనేజర్, శ్రీకాకుళం 1వ డిపో	9959225608	అసిస్టెంట్ మేనేజర్ (ట్రాఫిక్): 7095040608
డిపో మేనేజర్, శ్రీకాకుళం 2వ డిపో	9959225609	అసిస్టెంట్ మేనేజర్ (ట్రాఫిక్): 7382917289
డిపో మేనేజర్, టెక్కలి డిపో	9959225611	అసిస్టెంట్ మేనేజర్ (ట్రాఫిక్): 7382923311
డిపో మేనేజర్, పలాస డిపో	9959225610	అసిస్టెంట్ మేనేజర్ (ట్రాఫిక్): 7382924758

శ్రీకాకుళం అర్బన్: కార్తీకమాసం సందర్భంగా ఏపీఎస్ ఆర్టీసీ ఆధ్వర్యంలో పంచారామ క్షేత్రాలకు ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్లు ఏపీఎస్ ఆర్టీసీ శ్రీకాకుళం ఒకటి, రెండు డిపోల మేనేజర్లు పి.మల్లికార్జునరావు, కేఆర్‌ఎస్ శర్మ తెలిపారు. పంచారామ క్షేత్రాల సందర్శన కరపత్రాలను సోమవారం శ్రీకాకుళంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో విడుదల చేశారు. అమరావతి (అమరారామం), భీమవరం (భీమారామం), పాలకొల్లు (క్షీరారామం), ద్రాక్షారామం, సామర్లకోట (కుమారారామం) క్షేత్రాల దర్శనానికి బస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 19, 26వ తేదీ, డిసెంబరు 3, 10వ తేదీల్లో శ్రీకాకుళం 1, 1 డిపోలు, టెక్కలి, పలాస తదితర డిపోల నుంచి పంచారామాలకు ప్రత్యేక బస్సులు బయల్దేరుతాయన్నారు. ఈ పంచారామాలకు సూపర్ లగ్జరీ బస్సు, అల్ట్రా డీలక్స్, ఎక్స్ ప్రెస్ బస్సులు అందుబాటులో ఉంచామన్నారు. ఈ ప్రత్యేక బస్సులకు ముందస్తు రిజర్వేషన్ సదుపాయం ఉందని తెలిపారు. ప్రతి ఆది వారం సాయంత్రం 4 గంటలకు శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో బయల్దేరి సోమవారం ఐదు పుణ్య క్షేత్రాలను దర్శింపచేసి, మంగళవారం ఉదయం 6 గంటలకు మళ్లీ శ్రీకాకుళం కాంప్లెక్స్‌కు చేరుస్తామన్నారు. పూర్తిగా బస్సు బుక్ చేసుకున్నవారి ఇంటి వద్దకే బస్సు పంపిస్తామని తెలిపారు. బస్సు చార్జీల వివరాలు మనిషి ఒక్కరికి శ్రీకాకుళం నుంచి సూపర్ లగ్జరీకి రూ.2400, అల్ట్రా డీలక్స్ బస్సుకు రూ.2350, ఎక్స్ ప్రెస్ బస్సుకు రూ.2000 గా నిర్ణయించినట్లు తెలిపారు.

జాతీయ ఫుట్‌బాల్ పోటీలకు హారిక

శ్రీకాకుళం న్యూకాలనీ: ప్రతిష్టాత్మక జాతీయ మహిళా ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్–2023 పోటీలకు శ్రీకాకుళం జిల్లాకు చెందిన చిలుక హారిక ఎంపికైంది. ఈ పోటీలు పశ్చిమ బెంగాల్‌లో ఈనెల 15 నుంచి 20వ తేదీ వరకు జరగనున్నాయి. ఈ పోటీల్లో హారిక ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మహిళల జట్టు తరపున ప్రాతినిధ్యం వహించనుంది. ఈనెల 2 నుంచి 5వ తేదీ వరకు ఆచార్య నాగార్జున యూనివర్సిటీ క్రీడా మైదానంలో జరిగిన రాష్ట్రస్థాయి మహిళల ఫుట్‌బాల్ టోర్నీలో విశేషంగా రాణించడంతో గోల్ కీపర్ హారికకు మరింత లాభించింది.

టెక్కలి నుంచి జాతీయస్థాయికి..

టెక్కలిలోని మెట్టవీధిలో నివాసం ఉంటున్న చిలుక సాయిబాబు, రాజేశ్వరిల రెండో కుమార్తె హారిక. టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిగ్రీ బీఏ సెకెండియర్ చదువుతోంది. అక్క చిలుక మౌనిక, చెల్లి దీపిక ఇరువురు కూడా ఫుట్‌బాల్‌లోనే జాతీయస్థాయి క్రీడాకారిణులుగా గుర్తింపు పొందారు. నిరుపేద కుటుంబానికి చెందినప్పటికీ ఫుట్‌బాల్‌పై మక్కువతో గత కొన్నేళ్లుగా పట్టుదలతో రాణిస్తూ జాతీయ స్థాయికి చేరుకుంది. 2015లో టెక్కలి జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో 6వ తరగతి చదువుతున్న పీడీగా పనిచేసిన జె.విజయలక్ష్మి ప్రోత్సాహంతో ఫుట్‌బాల్‌లో ప్రవేశించడంతోపాటు రాటుదేరింది. హారికకు జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ అండగా నిలుస్తుండడంతో మరింత దూకుడుగా రాణిస్తోంది. ఆమె 2021లో గుంటూరులో జరిగిన జాతీయ



బెస్ట్ గోల్‌కీపర్ అవార్డుతో చిలుక హారిక

స్కూల్‌గేమ్స్ అండర్–19 బాలికల ఫుట్‌బాల్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో కాంస్య పతకం సాధించింది. దీంతో భారత అండర్–19 ప్రాబబుల్స్ జట్టుకు కూడా ఎంపికైంది. తాజాగా పశ్చిమబెంగాల్‌లో జరిగే ప్రతిష్టాత్మక పోటీలకు హారిక ఎంపికైంది.

భారత జట్టుకు ఆడటం నా కల

భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించడం నా కల. అందుకోసం నిరంతరం శ్రమిస్తున్నాను. ఈ సీజన్‌లో మరోసారి జాతీయ పోటీలకు ఎంపిక కావడం సంతోషంగా ఉంది. ఇది వరకు నాలుగు నేషనల్స్‌లో పాల్గొని మెడల్స్ కూడా సాధించాను. ఇండియన్ అండర్–19 ప్రాబబుల్స్ జట్టుకు ఎంపికయ్యాను. ప్రస్తుతం గోల్‌కీపర్‌గా నిలకగా రాణిస్తున్నందుకు ఆనందంగా ఉంది. నన్ను ప్రోత్సహించిన కోచ్‌లు, అసోసియేషన్ ప్రతినిధులు, కళాశాల అధికారులకు రుణపడి ఉంటాను.

– చిలుక హారిక, జాతీయ క్రీడాకారిణి

నదిలో పడి వ్యక్తి మృతి

పాతపట్నం: హిరమండలం మండలం ధనుపురం సమీపంలోని స్పైసీ దాబా ఎదురుగా ఉన్న మహేంద్రతనయ నదిలో పడి కొరసవాడ గ్రామం యాతలవీధికి చెందిన గొంప రామారావు(38) మృతి చెందాడు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. కొరసవాడ గ్రామం యాతలవీధికి చెందిన గొంప రామారావు సోమవారం మధ్యాహ్నం ఇంటి వద్ద భోజనం చేసి, గేలంతో చేపల వేటకి ధనుపురం గ్రామ సమీపంలోని మహేంద్రతనయ నదికి వెళ్లాడు. రాత్రి 6 గంటలైనా ఇంటికి రాకపోవడంతో భార్య గొంప రాములమ్మ కంగారు పడి ఇరుగుపొరుగు వారికి చెప్పారు. దీంతో వారంతా మహేంద్రతనయ నది తీరాన వెతికారు. రాత్రి 7 గంటల సమయంలో ధనుపురం సమీపంలో నదిలో మృతదేహం ఉందని గ్రామస్తులు చెప్పడంతో అక్కడకు వెళ్లి చూడడంతో గొంప రామారావు మృతదేహం కనిపించింది. దీంతో వారంతా కన్నీరుమున్నీరయ్యారు. రామారావుకు ఫిట్స్ ఉందని కుటుంబ సభ్యులు, గ్రామస్తులు చెబుతున్నారు. రామారావుకు లోకేష్, భూపతి అనే ఇద్దరు కుమారులు ఉన్నారు.

చెరువులో పడి వృద్ధుడు మృతి

రణస్థలం: మండలంలోని జేఆర్ పురం పంచాయతీలో గల శివాలయం కోవెల చెరువులో పడి మన్నెల లక్షుమము(70) అనే వృద్ధుడు మృతి చెందారు. జేఆర్ పురం పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. వృద్ధుడు సోమవారం ఉదయం 10 గంటల సమయంలో చెరువులో స్నానానికి దిగి ప్రమాదవశాత్తు మునిగిపోయాడు. స్థానికులు కాపాడే ప్రయత్నం చేసిన ఫలితం లేకపోయింది. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు జేఆర్ పురం ఎస్‌ఐ జి.రాజేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇంటిలో చోరీ

రణస్థలం: స్థానిక జేఆర్ పురం పంచాయతీలో గల పాత సబ్ రిజిస్ట్రార్ వీధిలో చెక్రోలు నరసింహమూర్తి ఇంటిలో ఆదివారం రాత్రి దొంగలు పడ్డారు. జేఆర్ పురం పోలీసులు, బాధితులు తెలిపిన ప్రకారం.. నర్సింహమూర్తి కుటుంబ సభ్యులు దీపావళికి ఇంటికి వెళ్లారు. ఆయన ఫ్రింజ్ లేబరేటరీ పరిశ్రమలో ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తుంటారు. ఆదివారం సాయంత్రం పనికి వెళ్లిపోయారు. సోమవారం ఉదయం 6గంటలకు రాగానే ఇంటిలో పరిస్థితి చూసి దొంగతనం జరిగిందని నిర్ధారించుకుని పోలీసులకు సమాచారం అందించారు. నాలుగు తులాల బంగారం, శతమానాలు, కాయిన్లు, 30 తులాల వెండి, 20వేలు వివిధ వెండి వస్తువులు, 30వేలు నగదు పోయినట్లు బాధితుడు నర్సింహమూర్తి తెలిపారు. జేఆర్ పురం సీఐ ఆదాం, ఎస్‌ఐ రాజేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.